# డ్రైవరు గురయ్య

పరుగెత్తే రైలు బండ్లను చూశారు కదూ? పసుపు, ఎరుపు ఆకుపచ్చ రంగు దీపాలు, వంకరు టింకర లైన్లు, పెద్ద పెద్ద ఇంజన్లు, బండిని పోనిచ్చేందుకు వాలే రెక్కలు, ఈ కూతలు, ఈలల గందరగోళమంతా గజిబిజిగా ఉన్నా చాలా తమాషాగా ఉంటాయి. మన శరీరంలోని రక్తనాళాల్లోంచి చురుకుగా నెత్తురు ఎంత వేగంగా పరుగెడుతుందో అల్లానే దేశంలోని రైల్వే లైనుల గుండా సరుకులు, మనుష్యులు ఒకచోటనుంచి మరొక చోటుకు పోతూంటారు.

పరుగెత్తే రైలుబళ్లను గురించి రెండు ముఖ్య విషయాలున్నాయి.

సరుకులు నష్టం కాకుండా చురుగ్గా దేశంలోని అన్ని చోట్లకు చేరటం.

మనుష్యులు ప్రయాణం చేస్తున్నప్పుడు ఏపాటి స్వల్ప ప్రమాదం కూడా జరగకుండా చూడటం.

ప్రమాదాలు జరగకుండా ఎంత శ్రద్ధ తీస్కున్నప్పటికీ ఒకప్పుడు ఘోరమైన తప్పిదాలు పొరబాట్లవల్ల పెద్ద పెద్ద రైలు ప్రమాదాలు జరగటం, ఆస్తులు, మనుషులు నష్టపోవటం మీరు పత్రికల్లో అప్పుడప్పుడు చదివేవుంటారు.

ఓ మారు ఏం జరిగిందంటే-

మద్రాసు మెయిలు కలకత్తావేపునించి శరవేగంతో వస్తోంది. మెయిలంటే సామాన్యమా?

ఆడవాళ్ళూ, పిల్లలు వేలకొద్దీ ప్రయాణం చేసేవాళ్లూ, పెద్ద పెద్ద ఉద్యోగులూ మంత్రులూ. గొప్పవాళ్లనేక మంది ప్రయాణం చేస్తూ ఉంటారు. కాని వాళ్లను క్షేమంగా వారి వారి చోట్లకు దిగబెట్టటం ఎంతో మెలకువ, శక్తి సామర్థ్యాలతో కూడుకున్నపని. అన్ని వేలమంది ప్రాణాలు డ్రైవరు గురయ్య గుప్పిట్లో ఉంటాయని చెబితే నమ్మలేం కదూ?

ఈ మెయిలు డ్రైవరు చదువుకోలేదు. బండినడపటానికి మంచి దిట్టమైన మనసూ, రాయిలాంటి గుండె కావాలి. నిశానీదారు గురయ్య, వెయ్యి రూపాయల జీతం తీసుకునే గురయ్యను గనక మీరు చూస్తే-

అబ్బే; ఇదేవి!cటీ మనిషి-అని నాలుక చప్పరిస్తారు.

చిరిగిన బూట్లూ, నీలి చొక్కా నీలిలాగూ, బండబూట్లూ నోట్లో లంకపుగాకు చుట్టా-కోపం వస్తే మరి బండ బూతులే, నోటంట వచ్చేవి. అతను ఇంజను బోర్డు మీద నిలబడితే ఫాలాక్షుణ్ని కూడా లెక్క చెయ్యడు. ఇక అతని లాగూ బెల్టుకి ఓ జేబు గడియారం సదా వ్రేలాడుతూంటుంది. అంతా నిముషాలు సెకన్ల దగ్గర్నుంచీ లెక్క. అతను రైలింజన్ని ప్రాణంలా చూసుకుంటాడు. దానికి కావలసిన బొగ్గును చక్కగా చిన్న చిన్న ముక్కలుగా కొట్టి వేయించుకుంటాడు. కావలసిన నీళ్ళను భద్రంగా నింపుకుని ముందే జాగర్త పడ్తాడు. చక్రాల్లో చమురు తన చేతుల్లో పోసుకుని, ఓ మారు అన్ని పరీక్షలూ చేసి తృప్తి పడ్డాక గాని బండిని వదలడు. బండి రొప్పిందన్నా, ఆవిరి బలం తగ్గిందన్నా గురయ్య గిలగిల్లాడిపోతాడు. చాలా ముఖ్యమైన సంగతేమంటే వాక్యూం (శూన్యం) బ్రేకుల్లానే బండి ఎంత వేగంలో ఉన్నా ఠక్కున నిలిచిపోవాలి. వాక్యూమ్ పేచీ పెట్టిందా-ఇన్ని వేల ప్రాణాలూ హరోహరి కావాల్సిందే.

రెండు స్టేషన్ల మధ్య-ఒకే రైలు మార్గం గుండా ఎప్పుడైనా ఒక బండి పోవటానికి మాత్రమే అనుమతి ఉంటుంది. లైను ఖాళీ అని అధికారులు బండిపోవటానికి అనుమతి ఇచ్చాకే ఏ రైలు బండి గాని ఒక స్టేషను వదిలి రెండవ స్టేషను వైపు పరుగెడుతుంది. పొరబాటున రెండు వైపులనుంచీ కూడా అటో రైలు ఇటో రైలూ ఎదురెదురుగా ఒకే లైను మీద వదలబడ్డాయో...ఫలితం...ఘోర ప్రమాదం...రైల్వే సిబ్బంది యావత్తూ అరెస్టు కావటం జరిగి తీరుతుంది.

ఇట్లాటిదే ఓ మారు మద్రాసు మెయిల్‌కూ మరో గూడ్సుబండికి ఒకే లైను మీద రెండు స్టేషన్‌ల మధ్య జరిగింది. నిజంగా.

గూడ్సుబండికి చాలా పెట్టెలుంటాయిగా. వెనుక గార్డు పెట్టెలో బండి ఆపే శక్తి నిరీక్షించకుండా వదలటమనే పొరబాటు జరిగిపోయింది. అంటే ఒక్కమాటు కొంతవేగంతో బండిని వదిలాక దానిని ఆపేశక్తి డ్రైవర్‌కీ, గార్డుకీ లేదన్నమాట!

అసలు గూడ్సుబండి ఇవతల స్టేషన్లో ఆగి, రెండవ వైపునించి మెయిలు ఈ స్టేషనుకు వచ్చాక తను ఖాళీ లైను మీద రెండవ స్టేషనుకు పోవాలి.

కాని ఎప్పుడైతే మొదటి స్టేషను వస్తున్నప్పుడు బ్రేకు వేసినా బండి ఆగలేదో గూడ్సు డ్రైవరూ, గార్డూ కూడా బిక్కచచ్చిపోయి తామూ ఇంకా ఇంజన్లో బొగ్గువేసే మనిషీ, ముగ్గురూ చనిపోవటం ఖాయమని నిర్ధారణకి వచ్చేశారు.

గూడ్సుబండి ఆగవల్సినప్పుడు కూడా ఆగకుండా రామబాణంలాగా పరుగెత్తి పోతున్నప్పుడు పాపం ఆ చిన్న స్టేషన్‌లోని సిబ్బంది యావత్తూ అరుస్తూ గగ్గోలుగా ప్లాటు ఫారం మీదకు వచ్చి గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయారు.

మృత్యువు మహాభయంకరంగా మనుష్యశక్తుల్నుంచి కట్టల్ని తెంచుకుని పరుగెడుతోంది.

గూడ్సు డ్రైవరు చేసేది లేక నిస్సహాయుడై వదలకుండా ప్రమాద సూచకంగా సైరను వేస్తూ పోతున్నాడు.

డ్రైవరు గురయ్య

బళ్ల రాకపోకల్ని కట్టడి చేసే అధికారిని 'కంట్రోలరు' అంటారు. అతను కూడా కాబిన్ లోంచి టెలిఫోన్ను తలకేసి కొట్టుకుంటూ ఇక కొన్ని నిముషాల్లో జరగబోయే దారుణ ప్రమాదాన్ని తెలుసుకుని గగ్గోలు పడిపోతున్నాడు.

మహాభయంకరంగా అరుచుకుంటూ మృత్యువులా వినాశం వైపు ఆగకుండా పరుగిడే గూడ్సు బండికీ సరిగా ఎదురుగా యాభైమైళ్ల వేగంతో, పిల్లలతో, పాపలతో, యువకులతో, వృద్ధులతో, ధనికులతో, పేదలతో-రకరకాల మనుష్యుల్తో, వేలాది జీవాలతో ఏదో తమతమ గమ్యస్థానాలకి సురక్షితంగా చేరుకుంటామనే ఆశలతో మహావేగంతో పరుగెత్తుకొస్తున్న మద్రాసు మెయిలు-

ఈ రెంటికీ ఎడం రెండువందల గజాలు! ఇన్ని వేలమంది ప్రయాణీకుల ఆయుష్షు రెండువందల గజాలు! అంటే ఇక మూడు నాలుగు నిమిషాలు.

కళ్లు మూసుకుంటే, రెప్పపాటు కాలం గడిస్తే తుండాలు, మొండాలు, పచ్చినెత్తురు, బోర్లపడ్డ పెట్టెల కింద నుంచి హాహాకారాలు-అంతే!

మృత్యువు! ప్రళయం! భీభత్సం!

మెయిలు డ్రైవరు గురయ్య-నిశానీ గురయ్య-సిక్కా వెయ్యి రూపాయల గురయ్య-రెండు వందల గజాల దూరంలో మహాభీకరంగా ప్రళయాన్ని సూచిస్తూ దిక్కులు దద్దరిల్లేలా అరుస్తూ వస్తున్న బ్రహ్మరాక్షసి కాలయముడ్ని చూశాడు.

రెండు వేల ప్రాణాలను ఇముడ్చుకున్న గుప్పెట్లో ఆ బొగ్గు మనిషి, కూలీ-ఆ పండితుడు రెగ్యులేటరును యావచ్ఛక్తీ వినియోగించి నొక్కాడు.

మెయిలు ఆగిపోయింది.

అంటే మృత్యువు యాభై గజాలూ, నలభై మైళ్ల వేగంతో అరుచుకుంటూ ముందుకి దూకింది. డ్రైవరు గురయ్య ఒక్కసారి ప్రేమతో స్పీడు మీటరును నలభైకి తిప్పి బండిని వెనక్కి నడపడం ఆరంభించాడు.

నలభైమైళ్ల వేగంతో గూడ్సుబండి మెయిలును తరుముకొస్తోంది.

అదే వేగంతో మెయిలు బండి వెనక్కి పరుగెడుతూ వుంది.

చావు బతుకుల మధ్య దూరం ఒక్క నూటయాభై గజాలే సుమండీ!

ఒక్క నూట యాభై!

ఓహ్హో! గురయ్యా!- నీకు పెళ్లాం, పిల్లలూ గుర్తు రావడం లేదయ్యా? రెగ్యులేటరు వదిలేసి బండిలో నుంచి దూకేసెయ్!

"బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు" చస్తే చస్తారు. జరిగే వినాశనం ఎలాగూ జరుగుతుంది!

గురయ్య దీక్షగా ముందుకు చూస్తున్నాడు. బండి యొక్క వేగం తగ్గలేదు, హెచ్చలేదు. రెగ్యులేటరు మీద చేయి కర్తవ్యాన్ని బోధిస్తోంది. గురయ్యా, నువ్వు తుక్కు తుక్కయి కాలిపో-కాని నీ చేయి ఈ రెగ్యులేటరు నుంచి కదలదు. నువ్వు వట్టి బొగ్గుమనిషివి-కూలీవి-నువ్వు చస్తే దేశానికేం నష్టం లేదు.

కాని పాపం, మెయిలులో ప్రయాణీకులు-బత్తాయి తొనలు ఒల్చుకుని తింటున్నారు. హాయిగా పడుకుని పుస్తకాలూ పత్రికలూ చదువుకొంటున్నారు. జేబుదొంగలు. ముష్టివాళ్లు, పవిత్రులు అపవిత్రులు-అంతా కాలంలో వెనక్కి పరుగెడుతున్నారు. తల్లులు పిల్లల్ని హృదయాలకు హత్తుకొంటున్నారు.

కొంతమంది మళ్లీ రైలు వెనక్కి పరుగెట్టడం గమనించారు. కాని అర్థం కాలేదు.

గురయ్య చావుకీ బ్రతుక్కీ మధ్యగల నూటయాభై గజాలనుంచి ఒక్క అంగుళం మేర వదల్లేదు. ఈ మహాసంగ్రామం ఒక్క అరగంటపాటు జరిగింది.

మద్రాసు మెయిలు రివ్వున బయలుదేరిన స్టేషను ప్లాటుఫారం మీదికి వచ్చేసింది.

మహామృత్యువును గురయ్య జయించాడు!

గూడ్సుబండి రొప్పుకుంటూ రెండవ లైను మీద నిల్చిపోయింది.

మెయిలు డ్రైవరు గురయ్య రెగ్యలేటరును తన బాహువుల్తో కావలించుకుని ఇంజన్నుండి దూకాడు.

గురయ్యను రైల్వే సిబ్బంది, ప్రయాణీకులూ, వంతులేసుకుని బుజాల మీద ఎక్కించుకుని ప్లాట్ ఫారం అంతా పరుగులెట్టారు.

పిన్నలు, పాపలు, వృద్ధులు, స్త్రీలు, యువకులూ అంతా మృత్యు గృహంలోంచి ఆనందంతో ఆ బొగ్గు మసి చొక్కా మనిషి వేపు చూశారు.

గురయ్య పిచ్చిగా నవ్వేస్తున్నాడు.

ఆ ప్రయాణీకులు ఎన్నితరాలు ఏం చేసి గురయ్య రుణం తీర్చుకుంటారు?

ప్రభుత్వం గురయ్య రుణం తీర్చుకుంది. యాభై రూపాయల కట్నం, ఒక సర్టిఫికెటు ముట్టింది. కాని గురయ్య ఒక లంక పొగాకు చుట్ట ఎక్కడన్నా దొరికితే బాగుండును అనుకున్నాడు. అది మాత్రం ఎక్కడా లేదు.